
## మీరు కాంగ్రెస్ మీటింగ్‌లకు వస్తే అరెస్టే

- కాంగ్రెస్ నాయకులతో తరిమి కొట్టిస్తామంటున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి
- 'నమస్తే తెలంగాణ, 'టీన్యూస్' రిపోర్టర్లకు బెదిరింపు కాల్స్




తొర్రూరు, జూన్ 16 : మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో 'నమస్తే తెలంగాణ, 'టీన్యూస్' రిపోర్టర్లకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. 'మీరు కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లకు రావొద్దు.. వస్తే కేసులు పెట్టి అరెస్టు చేయిస్తాం' అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సోమవారం ఉదయం వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి హెచ్చరించారు. 'మా పార్టీ కార్యక్రమాలకు మేం పిలిచినప్పుడు మాత్రమే రావాలి. లేకపోతే మా కార్యకర్తలతో కొట్టిస్తాం. అదీకాకుండా కేసులు పెడతాం' అని బెదిరించారు. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మీడియా ప్రతినిధుల హక్కులను కాలరాస్తే అది ప్రజాస్వామ్య వ్యవస్థపైనే దాడిగా భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీనిపై పాత్రికేయ సంఘాలు కూడా స్పందించి జర్నలిస్టుల హక్కులను కాపాడాలని కోరారు.

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసులశాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఉదయం సచివాలయానికి చేరుకున్న వాకిటి శ్రీహరికి వేద మంత్రోచ్ఛారణలతో పండితులు స్వాగతం పలికారు. అనంతరం తనకు కేటాయించిన చాంబర్‌లో వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు.



ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ వాకిటి శ్రీహరికి అభినందనలు తెలిపారు.

## సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్‌గా ప్రియాంక బాధ్యతలు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్‌గా సీహెచ్ ప్రియాంక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ హరీశ్‌కుమార్ తెలంగాణ జెన్‌కో ఎండీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీహెచ్ ప్రియాంకను సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంకకు సమాచార, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మీడియా అకాడమీ అధికారులు అభినందనలు తెలిపారు. అదేవిధంగా జెన్కో ఎండీగా వెళ్లిన డాక్టర్ హరీశ్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమాచారశాఖ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన వల్లూరు క్రాంతి సోమవారం సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు.



# కళ్లుండీ చూడలేని కబోదులా?

- అక్రమ నిర్మాణాలు కనిపించవా?
- కండ్లు ఉండీ చూడలేకపోతున్నారా?
- ఆదిలోనే చర్యలెందుకు తీసుకోరు?
- నిర్మాణాలు పూర్తయ్యాక ఆస్తులపై మీ అధికార ప్రతాపమా?
- జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై హైకోర్టు సీరియస్



హైదరాబాద్, జూన్ 16, (నమస్తే తెలంగాణ): అక్రమ నిర్మాణాలు కండ్లముందు జరుగుతున్నా మీకు కనిపించడం లేదా? కండ్లు మూసుకున్నారా? అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే చూడలేని కబోదులా? వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఆదిలోనే అడ్డుకుంటే మరొకరు అక్రమ నిర్మాణం చేపట్టేందుకు ముందుకురారు కదా? నిర్మాణం పూర్తయ్యాక అధికార ప్రతాపాన్ని చూపుతారా? అక్రమ నిర్మాణాన్ని సక్రమం చేసేందుకు భవనాల క్రమబద్ధీకరణ పథకం (బీఆర్‌ఎస్) కోసం అప్లికేషన్ పెట్టుకునే వెసులుబాటు కల్పించేలా సహకారం ఇస్తున్నారా? అసలు మీ మనసులో మీ ఆలోచనల్లో ఏ ముందో భగవంతుడు సైతం పసిగట్టలేరు.. అంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులపై హైకోర్టు నిప్పులు చెరిగింది. 'అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలియగానే ప్రారంభంలోనే అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. షోకాజ్ నోటీసు ఇవ్వగానే నిర్మాణాన్ని ఎందుకు సీజ్ చేయరు. అక్రమ నిర్మాణం పూర్తి చేసేవరకు ఎందుకు ఊరుకుంటున్నారు? నిర్మాణం అయ్యాక కూల్చివేస్తామని నోటీసు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు' అని హైకోర్టు మండిపడింది. గతంలోనే ఆదేశాలు జారీచేసినా ఎందుకు చర్యలు లేవని నిలదీసింది. అన్ని సర్కిల్స్‌లోనూ అధికారులు ఉంటారని, ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో, ఏవి అనుమతి తీసుకుని కడుతున్నారో వాళ్లకు తెలిసినా కూడా చర్యలు తీసుకోవడం లేదంటే ఏమనుకోవాలని కూడా ప్రశ్నించింది. మార్చి 31 నాటికి ఇండ్ల పన్నులు వసూలు చేయాలనే తపన అధికారులకు ఉంటుందేగానీ అక్రమ నిర్మాణాలపై మాత్రం ఉండటం లేదని వ్యాఖ్యానించింది.

### ఆదిలోనే చర్యలు ఎందుకు తీసుకోలేదు?

జీహెచ్ఎంసీ కూల్చివేత నోటీసును సవాల్ చేస్తూ రంగారెడ్డిజిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటకు చెందిన కే రఘువీరాచారి వేసిన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన పైవిధంగా అధికారులను నిలదీశారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ, నిర్మాణం పూర్తయ్యిందని, దాని క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. తమ దరఖాస్తుపై ఏ నిర్ణయం తీసుకోకుండానే నోటీసు ఇచ్చారని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు, అధికారులు కళ్లు మూసుకున్నారా, లేక కళ్లున్నా చూడలేకపోతున్నారా, ఆదిలోనే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా నిర్మాణం పూర్తి అయ్యాక కూల్చివేత నోటీసు ఇవ్వడం ఏమిటని నిలదీసింది. షోకాజ్ నోటీసు జారీచేసినపుడే సెక్షన్ 461 కింద అక్రమ నిర్మాణ ఆస్తిని ఎందుకు సీజ్ చేయరని ప్రశ్నించింది. పిటిషనర్‌కు జీహెచ్ఎంసీ ఇచ్చిన నోటీసు అమలును యథాతథస్థితిలో (స్టేటస్ కో) ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

# సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యమెందుకు?

- ఎన్నిసార్లు హెచ్చరించినా పనితీరులో మార్పు రాదా?
- పిడుగు కాంతికంటే వేగంగా కల్పించుకుంటున్నారు
- పోలీసులే సివిల్ సెటిల్‌మెంట్స్ చేసేలా చట్టం చేయండి
- రాష్ట్ర పోలీస్‌శాఖ తీరుపై తీవ్రవ్యాఖ్యలు చేసిన హైకోర్టు

హైదరాబాద్, జూన్ 16, (నమస్తే తెలంగాణ): సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవడంపై హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. విల్లులు, గిఫ్ట్ డీడ్స్ వివాదాల్లో సైతం పోలీసులు జోక్యం చేసుకున్నారని పేర్కొంది. ఇండ్ల స్థలాలు, పొలాలు, అద్దె షాపులు.. వంటి వివాదాలను చట్టప్రకారం రెంట్ కంట్రోల్ యాక్ట్ చేయాల్సిన బాధ్యతలన్నీ పోలీసులకు ఇచ్చేలా చట్టసభలో (అసెంబ్లీ) చట్ట సవరణ చేసేలా చర్యలు తీసుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేసింది. సివిల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు వివాదంలో కూడా పోలీసులు జోక్యం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. పోలీసులే సివిల్ వివాదాలను పరిష్కరించేలా చట్టం తెచ్చేస్తే సరిపోతుందని వ్యాఖ్యానించింది. పిడుగు పడితే రెప్పపాటు కాంతి చిమ్ముతుందని, కానీ అంతకంటే తక్కువ సమయంలోనే పోలీసులు జోక్యం చేసుకుంటున్నారంటూ నిప్పులు చెరిగింది. తమను నమ్ముకున్న వాళ్లకు తక్షణ సాయం చేసేందుకు తహతహలాడుతున్నారని వ్యాఖ్యానించింది.


### ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా?

పోలీసులు చట్ట వ్యతిరేకంగా సివిల్ వివాదాల్లో ఎలా జోక్యం చేసుకుంటారని ప్రశ్నించింది. కోర్టులో దాఖలయ్యే సివిల్ వివాదాల్లో 70 శాతం పోలీసుల ప్రమేయం గురించేనని తెలుపుతూ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు హితవు చెప్పినా, అనేకసార్లు హెచ్చరించినా పోలీసుల తీరులో మార్పు రావడం లేదని మండిపడింది. పోలీసులపై 31 పిటిషన్లు నమోదైతే అందులో 25 కేసులు సివిల్ వివాదాలు హైకోర్టులో ఉన్నాయని చెప్పింది. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోరాదని ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా అని ప్రశ్నించింది. మీకు సంబంధం లేని వివాదాల్లో ఎలా జోక్యం చేసుకుంటారని నిలదీసింది. హైదరాబాద్ బార్కస్‌లోని 256 గజాల ఇంటి స్థలానికి సంబంధించి సివిల్ కోర్టులోని సూట్ ఉపసంహరణకు పోలీసులు ఒత్తిడి చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ టీ వినోద్ కుమార్ సోమవారం మరోసారి విచారణ జరిపారు. మోహిసిన్ బఫానా దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై హైకోర్టు స్పందిస్తూ, సివిల్ కోర్టులో దావాను విత్‌డ్రా చేసుకోవాలని చెప్పే అధికారం మీకెవరిచ్చారని పోలీసులను ప్రశ్నించింది. పోలీసుల వ్యవహారశైలి, సివిల్ వివాదాల్లో జోక్యంతో పౌరులు భయపడుతున్నారని వ్యాఖ్యానించింది. ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్ అని ప్రశ్నించింది. హైదరాబాద్ పోలీస్ యాక్ట్ ప్రకారం డ్యూటీ చేయాలనే విషయం తెలియదా, ఇదే అంశంపై గతంలోనే తాము ఉత్తర్వులు ఇచ్చిన విషయమైనా గుర్తుందా? అని ప్రశ్నించింది. చట్టాలు, నిబంధలనకు తిలోదకాలిచ్చి పోలీసులు కొత్త అవతారాలు ఎత్తుతున్నారని వ్యాఖ్యానించింది. సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని సిటీ పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు ఇస్తామని హెచ్చరించింది. ఈ దశలో ప్రభుత్వ న్యాయవాది కల్పించుకుని, పోలీసులు సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోబోరని హామీ ఇచ్చారు. పోలీసులకు అందిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదైనందున చట్టప్రకారం వ్యవహారం ఉంటుందని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు పోలీసులు ప్రజల్లో విశ్వాసం కోల్పోతే వచ్చే నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని స్పష్టంచేసింది. గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో పోలీసులు బయటినుంచి స్టేషనరీ తేవాలని కోరినట్టు ఒకరు చెప్పారని తెలిపింది. దర్యాప్తు చేస్తామన్న ప్రభుత్వ హామీని పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌పై విచారణను మూసివేస్తున్నట్టు ప్రకటించింది.



## స్కిల్ యూనివర్సిటీకి సహకరించండి

- కేంద్రమంత్రికి శ్రీధర్ బాబు వినతి



హైదరాబాద్, జూన్ 16(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. సోమవారం మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రపెన్యూర్‌షిప్(గవర్నమెంట్ ఆఫ్ ఇండియా), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్(తెలంగాణ) సంయుక్తాధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని పీజీ లా కళాశాలలో ఏర్పాటు చేసిన 'మెగా జాబ్/స్కిల్ అండ్ లోన్ మేళా'ను కేంద్ర మంత్రి జయంత్ చౌదరితో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 'యువత ప్రతిభే ఈ రాష్ట్రానికి అతి పెద్ద ఆస్తి. కానీ.. చాలా మందిలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు ఉండటం లేదు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య నెలకొన్న అంతరాన్ని మా ప్రభుత్వం గుర్తించి స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది..' అని మంత్రి వివరించారు.

## నిర్మాణం పూర్తికాని 'డబుల్' ఇండ్లకు 5లక్షలు: పొంగులేటి



హైదరాబాద్, జూన్ 16(నమస్తే తెలంగాణ): రాష్ట్రం లో నిర్మాణం పూర్తికాని 69వేల డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కు రూ. 5లక్షల చొప్పున అందించనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పథకాలపై సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల గృహాలు నిర్మిస్తామని చెప్పారు.

## కేంద్రం చేతుల్లోనే రిజర్వేషన్లు: సీతక్క

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): 42 శాతం రిజర్వేషన్ల అంశం కేంద్రం చేతుల్లో ఉందని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెం ట ర్ వద్ద సోమవారం మీడియాతో ఆమె మాట్లాడారు. స్థానిక ఎన్నికల నిర్వహణపై తన వ్యాఖ్యలను వక్రీకరించారని తెలిపారు. మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు.

## ఆంధ్రాకేనా నిధులు: మంత్రి సురేఖ

కాశీబుగ్గ, జూన్ 16 : గోదావరి పుష్కరాల నిధుల విషయంలో కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. సోమవారం వరంగల్ ఓసీటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. నిధుల్లో ఏపీకి ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయమా..? అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాస్తానని చెప్పారు.

# రేవంత్‌రెడ్డికి భంగపాటు తప్పదు

- సీఎంది రాజకీయ కక్షసాధింపు
- కేసీఆర్, కేటీఆర్‌ను ఎదుర్కోలేకే దెబ్బతీసేందుకే పాత కేసులు
- కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీది గ్లోబెల్స్ ప్రచారం
- బీఆర్‌ఎస్ ఎన్నారై శ్రేణులతో హరీశ్



బీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆధ్వర్యంలో జరిగిన జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేసు, కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం బీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆధ్వర్యంలో జరిగిన జూమ్ మీటింగ్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో లావాదేవీలు పూర్తి పారదర్శకంగా జరిగాయని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్‌ను దెబ్బతీసేందుకు పాత కేసులతో రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ కుట్రలకు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. ఈ జూమ్ మీటింగ్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీఆర్‌ఎస్ ఎన్నారై శ్రేణులకు కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలు వివరించారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆధారాలతో వివరించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రాజెక్టుపై చేస్తున్న కుట్రలను ఎన్నారై గులాబీ శ్రేణులకు స్పష్టంగా వివరించారు.

### కాంగ్రెస్‌ది గోబెల్స్ ప్రచారం

ఐదేండ్లలో మేడిగడ్డలో ఎత్తిపోసిన నీళ్లు 162 టీఎంసీలేనని కాంగ్రెస్ చెప్తున్నదని, కాళేశ్వరంలో భాగమైన ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు లిఫ్ట్ చేసిన విషయాన్ని ఎందుకు చెప్పడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. లక్ష్మి, సరస్వతి, పార్వతి, నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి ఎత్తిపోసిన నీళ్ల గురించి ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. 2022-23 వరకు మేడిగడ్డ నుంచి 162.41 టీఎంసీలు, అన్నారం నుంచి 172.86 టీఎంసీలు, సుందిళ్ల నుంచి 172.12 టీఎంసీలు, నంది పంప్‌హౌస్ నుంచి 181.7 టీఎంసీలు, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 179.41 టీఎంసీల జలాలను ఎత్తిపోసినట్టు చెప్పారు. సమగ్ర సమాచారం తెలుసుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై గోబెల్స్ ప్రచారం ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు డీపీఆర్ (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక) లేదని కొందరు బురద చల్లే ప్రయత్నం చేశారని, కానీ డీపీఆర్ లేకుండా కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ప్రాజెక్టు కోసం అవసరమైన అన్ని అనుమతులను తెచ్చిన తర్వాతే పనులు మొదలు పెట్టామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాధించిన ఫలితాలు, ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషిని వివరించగా బీఆర్‌ఎస్ ఎన్నారై శ్రేణులు చప్పట్లతో హోరెత్తించారు. హరీశ్‌రావు చెప్పిన వివరాలను శ్రద్ధగా నోట్ చేసుకున్నారు. ప్రజెంటేషన్ అనంతరం తక్కువ సమయంలో వివరాలను సమగ్రంగా తెలియజేసిన హరీశ్‌రావును ఎన్నారై శ్రేణులు ప్రశంసించారు.

## కథక్ నృత్యకారిణి మంగళా భట్ కన్నుమూత

- నేడు జూబ్లీహిల్స్‌లో అంత్యక్రియలు



మంగళా భట్ (ఫైల్)

బంజారాహిల్స్, జూన్ 16: ప్రఖ్యాత కథక్ నృత్యకారిణి, నాట్యగురు మంగళా భట్ (62) కన్నుమూశారు. అనారోగ్యంతో కొంత కాలంగా హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం తుదిశ్వాస విడిచారు. కథక్ నృత్యంలో దేశ, విదేశాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చిన మంగళా భట్.. ప్రముఖ కథక్ నాట్యగురు రాఘవరాజ్ భట్ సతీమణి. జానపద కళాబ్రహ్మ గోపాల్ రాజ్‌భట్‌కు కోడలు. మంగళా భట్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని స్వీకరించారు. మంగళవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన ములుగు డీఈవో

- జేఏతో కలిసి రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



లంచం తీసుకుంటూ పట్టుబడిన డీఈవో పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ యాదవ్

ములుగు, జూన్16(నమస్తే తెలంగాణ) : ములుగు డీఈవో జూనియర్ అసిస్టెంట్‌తో కలిసి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు 2024 ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదానికిగురై సెలవులోఉన్నాడు. అక్టోబర్ 1న డీఈవో కార్యాలయానికి వచ్చి జాయినింగ్ రిపోర్టు ఇవ్వగా డీఈవో పాణిని రూ.20వేలు ఇస్తేనే రీ పోస్టింగ్ ఇస్తానని, ఆర్డర్ తయారు చేసినందుకు జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్‌కు రూ.5వేలు ఇవ్వాలని చెప్పారు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు రాగా డీఈవో డబ్బులు డిమాండ్ చేశారు. జీతం రావడంలేదని ప్రాధేయ పడటంతో తనకు రూ.15వేలు, దిలీప్‌కు రూ.5వేలు ఇవ్వాలని చెప్పారు. సోమవారం డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడి నుంచి 20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డీఈవో, జూనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదుచేసి, వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు.

### ములుగు డీఈవో సస్పెన్షన్

అవినీతి నిరోధకశాఖకు పట్టుబడ్డ ములుగు జిల్లా డీఈవో పాణిని అధికారులు సస్పెండ్‌చేశారు. సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆయన్ను సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

## రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి

మునిపల్లి, జూన్ 16: ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మెదక్ రేంజ్ డీఏస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేరాకు చెందిన ఓ వ్యక్తి రేకుల షెడ్డు, కరెంట్ మీటర్ కోసం జీపీలో దరఖాస్తు చేసుకున్నాడు. పని పూర్తికావాలంటే రూ. 12వేలు అవుతుందని పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి తెలుపడంతో బాధితుడు రూ.10వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. సోమవారం బుధేరా జీపీ కార్యాలయంలో బాధితుడి వద్ద కార్యదర్శి నాగలక్ష్మి రూ.8వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కారు. కార్యదర్శిని మునిపల్లి మండల పరిషత్ కార్యాలయానికి తరలించి వివరాలు సేకరించారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి

# డేంజర్ జోన్‌లో మెడికల్ కాలేజీలు

- వసతుల లేమి, సర్కారు నిర్లక్ష్యంపై ఎన్ఎంసీ సీరియస్
- 26 మెడికల్ కాలేజీలకు జాతీయ వైద్య మండలి నోటీసులు
- 18న విచారణకు రావాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈకి నోటీసులు




హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని 26 మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతుల లేమిపై జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సరైన హాస్టల్ భవనాలు లేవని, అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని ఆక్షేపించింది. విద్యార్థులు పాఠాలు నేర్చుకునేందుకు మృతదేహాలు (క్యాడావర్), ప్రయోగశాలలు, క్లినికల్ పారామీటర్లు లేవని సీరియస్ అయింది. వసతుల లేమిపై ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఇచ్చిన వివరణతో ఎన్ఎంసీ సంతృప్తి చెందలేదు. నిరుడు గుర్తించిన లోపాలను ఇప్పటికీ సరిదిద్దుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ కాలేజీలకు రూ.2లక్షల నుంచి రూ.13 లక్షల వరకు జరిమానా విధించింది. వైద్య కళాశాల్లోని లోపాలపై చర్చించేందుకు ఈ నెల 18న ఢిల్లీలోని జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) కార్యాలయంలో నిర్వహించే విచారణకు వర్చువల్‌గా హాజరు కావాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శితోపాటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) శుక్రవారం ఆదేశించింది.

### ప్రమాదంలో 2,700 మెడికల్ సీట్లు

మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులు ఉన్నాయో లేదో ఎన్ఎంసీ పరిశీలిస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలోని 35 కాలేజీల్లో తనిఖీలు చేసిన ఎన్ఎంసీ.. 26 కాలేజీల్లో వసతులు లేవని గుర్తించింది. ముఖ్యంగా విద్యార్థుల అటెండెన్స్, క్లినికల్ ట్రైనింగ్, మౌలిక సదుపాయాల్లో తీవ్ర ఉల్లంఘనలు ఉన్నట్టు తేల్చింది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం (2025-26) ఆ కళాశాలను కొనసాగించాలో లేక రద్దు చేయాలో నిర్ణయించేందుకు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో 2,700 మెడికల్ సీట్లు ప్రమాదంలో పడనున్నాయి.

### కేసీఆర్ సంకల్పానికి తూట్లు

2014లో స్వరాష్ట్రంగా ఏర్పడే నాటికి తెలంగాణలో 5 ప్రభుత్వ, 15 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, వాటిలో 2,850 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కో జిల్లాలో ఒకో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయించడంతో 2023 అక్టోబర్ నాటికి మొత్తం కళాశాలల సంఖ్య 56కు, సీట్ల సంఖ్య 8,340కి చేరింది. అప్పటికే కేసీఆర్ ప్రభుత్వం మరో 8 కాలేజీలను మంజూరు చేయడంతో మొత్తం మెడికల్ సీట్ల సంఖ్య 9,140కి పెరిగింది. కానీ, కేసీఆర్ సంకల్పానికి తూట్లు పొడుస్తున్న ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు.. వైద్య కళాశాలల్లో కనీసం వసతులు కల్పించలేని దుస్థితిలో ఉన్నది.

### ప్రతి మెడికల్ కాలేజీని కాపాడుకుంటాం: మంత్రి రాజనర్సింహ

రాష్ట్రంలోని ప్రతి మెడికల్ కాలేజీని కాపాడుకుంటామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రతి కాలేజీలో మౌలిక వసతులు కల్పిస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు.

### నిబంధనలు పాటించని 26 కాలేజీలు ఇవే..

ఖమ్మం, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సూర్యాపేట, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, రామగుండం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మెదక్, ములుగు, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, కుత్బుల్లాపూర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల, వనపర్తి.

### తక్షణమే నిధులు విడుదల చేయాలి..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల భవితవ్యం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రశ్నార్థకంగా మారడం అత్యంత శోచనీయం. 26 మెడికల్ కాలేజీల్లో నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు, వసతులు లేకపోవడంపై ఈ నెల 18న ఎన్ఎంసీ ముందు ప్రత్యక్షంగా హాజరు కావాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈకి తాఖీదులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం. ఇంత ముఖ్యమైన విషయంపై సీఎం ఆలస్యంగా మేల్కొని, ఎట్టకేలకు సోమవారం ఓ కమిటీని వేయడం హాస్యాస్పదం. ఆ 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చదువుతున్న వందల మంది విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు భరోసా? మీ పరిపాలన వైఫల్యం మెడికల్ విద్యార్థులకు శాపంగా మారుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ మెడికల్ కాలేజీల భవితవ్యాన్ని కాపాడాలి. వైద్యులు కావాలనుకుంటున్న విద్యార్థుల జీవితాలను నిలబెట్టాలి.

**- మాజీ మంత్రి హరీశ్ రావు**